క్లుప్తంగా

ఖాతాలను అప్‌డేట్ చేసుకోండి

దామరగిద్ద: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) లో పంట రుణ ఖాతాలను కలిగి ఉన్న రైతులు కొత్త పట్టదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు జీరాక్స్‌లను అందించి అప్‌డేట్ చేసుకోవాలని చైర్మన్ ఈదప్ప తెలిపారు. గతంలో పాత పాస్‌బుక్‌లతో పంట రుణాలు పొందిన వారు తిరిగి కొత్త పట్టదారు పాస్‌బుక్, ఆధార్ జీరాక్స్‌లను ఇవ్వాలన్నారు. బ్యాంక్ ఖాతా ఉండి ఓపెన్ కాని వారు రెండు ఫొటోలతో ఖాతాదారులు దరఖాస్తు ఫారం పై సంతకాలు చేసి అందించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు పీఏసీఎస్ కార్యదర్శి మురారి, సిబ్బంది వెంకటేష్‌ను కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

7న జనజాగృతి ధర్మ సమావేశం

కృష్ణా: మండలంలోని చేగుంట గ్రామంలో ఉన్న పార్వతి పరమేశ్వర ఆలయంలో శనివారం నిర్వహించే జనజాగృతి ధర్మ సమావేశానికి మండల ప్రజలు, భక్తులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని శ్రీ క్షీరలింగ మహాస్వామి కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ధర్మ సమావేశానికి కాశీ నూతన జగత్ గురువులతో పాటూ కడెచూర్, బాడియాల్, గోబ్బూర్, నేరడగం, రాయచూర్ మఠాల పీఠాధిపతులు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు వివరించారు. జగత్ గురువుల సమక్షంలో జంగమ వటులకు ఉపనయన కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పనులను నాణ్యతతో చేపట్టాలి

కోయిల్‌కొండ: తహసీల్దార్ కార్యాలయ భవన మరమ్మతు పనులను నాణ్యతతో చేపట్టాలని తహసీల్దార్ ప్రేమ్‌రాజ్ అన్నారు. గురువారం జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ మరమ్మతుల కోసం రూ.10 లక్షల మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. గతంలో కార్యాలయం వర్షాకాలంలో కురుస్తుందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా నిధులను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనయ్య, మాజీ సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య, ఆంజనేయులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

తిర్మలాపురాన్ని కౌకుంట్లలో కలపడం సరికాదు

చిన్నచింతకుంట: తిర్మలాపురాన్ని చిన్నచింతకుంట మండలంలోనే కొనసాగించాలని గ్రామస్తులు జనార్దన్, వడ్డె మహేందర్, పంతులు శ్రీనులు డిమాండ్ చేశారు. గ్రామంలో క్రీడా మైదానం స్థలాన్ని పరిశీలించేందుకు వచ్చిన ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్‌లకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నచింతకుంట మండల కేంద్రానికి దగ్గరలో ఉన్న తిర్మలాపురాన్ని కొత్తగా ఏర్పాటైన 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న కౌకుంట్ల మండలంలో కలపడం సరైనది కాదన్నారు. కౌకుంట్ల మండలంలో కలిపి గ్రామస్తులకు తీవ్ర అన్యాయం చేశారని వారు మండిపడ్డారు. కార్యక్రమంలో గ్రామస్తులు కుర్వ రాములు, చిన్న వెంకటన్న, మహేష్, బాలు, భాగ్యమ్మ ఉన్నారు.

బస్సులు నడపాలని రాస్తారోకో

అమరచింత: పాఠశాల, కళాశాల సమయానికి ఆర్టీసీ అధికారులు బస్సులను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అమచింత బస్టాండ్ కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాఘవ మాట్లాడుతూ కొన్ని రోజులుగా మరికల్ నుంచి ఆత్మకూర్, ఆత్మకూర్ నుంచి నర్వ మండల కేంద్రాలకు ఆర్టీసీ షటిల్ సర్వీస్‌లు నిలిపివేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతూ పాఠశాల, కళాశాలలకు వెళ్తున్న పరిస్థితులు దాపరించాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆత్మకూర్, అమరచింత మండల కేంద్రాలకు ఇతర గ్రామాల నుంచి వందలాది మంది విద్యార్థులు చదువుకోవడానికి వస్తున్నారని, సమయానికి బస్సులు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి నిలిపి వేసిన నర్వ షటిల్ సర్వీస్‌ను కొనసాగించాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు అక్బర్, సాయి అశోక్, బాస్కర్, మహేష్, అర్చన తదితరులు పాల్గొన్నారు.

శబరికి తరలిన మాలాధారులు

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని అయ్యప్ప భక్తులు గురువారం శబరిమల అయ్యప్ప కొండకు బయలు దేరారు. సుమారు 25మందికి పైగా అయ్యప్ప భక్తులు తరలివెళ్లినట్లు గురుస్వాములు శేఖర్‌స్వామి, విద్యాసాగర్‌స్వాములు తెలిపారు. అంతకుముందు గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో అయ్యప్పస్వాములు ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా అయ్యప్పస్వామికి సమర్పించాల్సిన ఇరుముడులు ధరించారు. ప్రత్యేక వాహనాల్లో స్వామిని దర్శించుకునేందుకు శబరికి బయలుదేరారు. కార్యక్రమంలో గురుస్వాములు నందుస్వామి, అశోక్, శ్యాంసుందర్, వెంకట్, వనం రాఘవేందర్, రంజిత్, రాము, గోవు, ప్రతాప్, పండు తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


బిజ్వార్‌లో విద్యార్థులతో ఎంపీడీఓ తదితరులు

- గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ప్రాంగణాలు
- ఆయా గ్రామాలలో పోటీలను ప్రారంభించిన ఎంపీడీఓలు
- నైపుణ్యాలను వెలికితీయడమే లక్ష్యం

కోస్గి: గ్రామీణ స్థాయిలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించి క్రీడలకు ఆదరణ కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగాణాలను ఏర్పాటు చేసిందని, సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటయ్య సూచించారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని హకీంపేట గ్రామంలో క్రీడా మైదానంలో విద్యార్థులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. అంతకుముందు పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. సర్పంచ్ కృష్ణయ్య, హెచ్‌ఎం, పాల్గొన్నారు.

మాగనూర్: గ్రామీణ ప్రాంతాల్లోని యువతీయువకులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ప్రతి పంచాయతీకో క్రీడా ప్రాంగణాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అవరణలో ఏర్పాటు చేసిన నూతన క్రీడా ప్రాంగణంలో గ్రామ యుకులకు వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం ఉన్న క్రీడాకారులను వెలికితీసి, జాతీయ స్థాయిలో వారి ప్రతిభను చాటేందుకు కృషి చేస్తామని తెలిపారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. అదేవిధంగా మండలంలోని మిగతా పంచాయతీలో కూడా క్రీడా ప్రాంగణాలు నిర్మాణం పూర్తి అయిందని అతి త్వరలోనే వాటిని కూడా ప్రారంభిస్తామని అన్నారు. సర్పంచ్ రాజు, కార్యదర్శి రాఘవేంద్ర, పాఠశాల పిడి వెంకటేష్, పాల్గొన్నారు.

మద్దూరు: మండలంలోని మద్దూరు, నందిపాడ్, పెదిరిపాడ్, కొత్తపల్లి మండలంలోని భూనీడ్, నిడ్జింత ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు గురువారం వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీఓ నాగరాజు, అయా గ్రామాల సర్పంచ్‌లు, ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలు పాల్గొన్నారు. ఈ నెల 5 నుంచి 11 వరకు ప్రభుత్వ క్రీడా ప్రాంగణాల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన వారికి జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే క్రీడల్లో పాల్గొనడానికి అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు.


మాగనూర్‌లో పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీడీఓ


కోస్గి మండలంలోని హకీంపేటలో..


భూనీడ్‌లో పోటీలను తిలకిస్తున్న ఎంపీడీఓ.

ఊట్కూరు: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలుగజేస్తాయని ఎంపీడీఓ కాలప్ప అన్నారు. గురువారం బిజ్వార్‌లోని క్రీడా మైదానంలో ఆటలపోటీలు నిర్వహించారు. కబడ్డీ, వాలీబాల్ తదితర పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. క్రీడల వల్ల క్రమశిక్షణ, ఏకాగ్రత, ఉంటుందని తెలిపారు. సర్పంచ్ సావిత్రమ్మ, ఎంపీఓ ఎల్లయ్య, నాయకుడు గోవర్దన్, ఉపాధ్యాయులు రవికుమార్, బన్నేష్, మనోహర్ పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ధన్వాడ: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జీ కాంతారావు, పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌లు కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. ధన్వాడ మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అసత్య ఆరోపణలను తిప్పికొట్టెందుకు సమాయత్తం కావాలన్నారు. రాబోవు ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని అన్నారు. మండల అధ్యక్షులు సురేందర్, గోవర్ధన్‌గౌడ్, రామచంద్రయ్య, ఉదయభాను, మల్లయ్య, శ్రీనివాసులు, నారాయణ, ఎర్రప్ప, రాఘవేందర్‌గౌడ్, శివరాజ్‌లు పాల్గొన్నారు.

మక్తల్: కేంద్రం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరుతున్నాయని బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ కాంతారావు, మక్తల్ అసెంబ్లీ పాలక్ పూనమ్‌చంద్ లాహోటీ అన్నారు. మక్తల్ పట్టణంలో గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కేంద్రం ప్రజల కోసం తీసుకువచ్చిన వివిధ పథకాలపై బీఆర్‌ఎస్ ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తోందన్నారు. ఆ పార్టీకి బుద్ధి చెప్పాలని కార్యకర్తలకు సూచించారు. ఆ రోజోయే రోజుల్లో తెలంగాణాలో అధికారంలోకి వస్తామన్నారు. అందుకోసం ప్రతి కార్యకర్త బూత్‌స్థాయి నుంచి కృషి చేయాలని కోరారు. 7న జరిగే సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.నాయకులు శ్రీనివాసులు, కర్నిస్వామి, బాల్‌రాంరెడ్డి, మల్లికార్జున్, రాజశేఖర్‌రెడ్డి, సుభాష్‌చందర్, కనకరాజు, మేర్వరాజు, శ్రీకాంత్, నర్సింహారెడ్డి, అమరదీక్షిత్, శ్రీను, నర్సప్ప, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంతారావు

‘మనఊరు మనబడి’తో సమస్యల పరిష్కారం

మాగనూర్: మండల పరిధిలోని వడ్వాట్ గ్రామ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులకు మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా ఎన్ఆర్‌జీఎస్ నిధుల ద్వారా రూ. 5 లక్షలతో నూతన మూత్రశాలల భవన నిర్మాణంకు గ్రామ సర్పంచ్ నర్సిములు భూమిపూజ చేశారు. నిర్మాణాలలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. మన ఊరు మన బడితో ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయని అన్నారు. ఇప్పటికే పాఠశాలలో అనేక సమస్యలు పరిష్కరం దిశగా సాగుతున్నాయని అన్నారు. కాంట్రాక్టర్లు వేగవంతంగా పనులు పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఎంపీటీసీ సుదర్శన్‌గౌడ్, మాజీ సర్పంచ్ రవీందర్, ఉపసర్పంచ్ సరస్వతి, ఎస్ఎంసీ చైర్మన్ వాకిటి శ్రీను, గ్రామపెద్దలు రాజేశ్వర్‌రెడ్డి, నర్సింములుగౌడ్, బసంత్‌రెడ్డి, ఉజ్జేల్లి సురేష్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న సర్పంచ్ నర్సిములు

ఏఎన్‌ఎంకు సన్మానం

మాగనూర్: మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కృష్ణ సబ్‌సెంటర్ జిల్లా స్థాయిలో ఉత్తమసేవలకు గాను వరుసగా మూడవ సారి ప్రథమస్థానం పొందిందని వైద్యాధికారి వెంకటరమణ అన్నారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశ కార్యకర్తల రివ్యూ మీటింగ్‌లో భాగంగా కున్సి సబ్‌సెంటర్ ఏఎన్‌ఎం అలివేలు, ఆశ కార్యకర్తలను డాక్టర్ శాలువ, పూల మాలలతో సన్మానించారు. ఆరోగ్యశాఖ నిర్దేశించిన లక్ష్యాలకు సంబంధించి వందశాతం చేరుకుందని అన్నారు. ముఖ్యంగా గర్భిణుల విషయంలో ఆమె చూపిస్తున్న చొరవ చాలా బాగుందని కొనియాడారు. మిగత వారు ఆమెను ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని సూచించారు. అదే విధంగా గుడెబల్లూర్ సబ్‌సెంటర్ కూడా జిల్లాస్థాయిలో ఐదవ స్థానంలో నిలిచిందని అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు యాదమ్మ, మల్లీశ్వరమ్మ, వెంకటేష్‌గౌడ్, సీహెచ్‌ఓ సాయిబాబా, ఏఎన్‌ఎంలు సుధా, వేదవతి, వర లక్ష్మి, రామేశ్వరి, గిరిజ, రజిని, శారద తదితరులు పాల్గొన్నారు.


ఏఎన్‌ఎంను సన్మానిస్తున్న మండల వైద్యాధికారి

కేసులు పెట్టడం సరికాదు

మరికల్: చిత్తనూర్ ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న వారిపై పోలీసులు కేసులు పెట్టడం సరికాదని ఓపీడీఆర్ నిజనిర్ధారణ కమిటీ నివేదిక కన్వీనర్ భాస్కర్‌రావు గురువారం ఒక ప్రకటనలో అన్నారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ 1975 చట్ట ప్రకారం అణిచివేత చట్ట విరుద్ధమన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ, పంచాయితీల అనుమతులు తీసుకోకుండానే జూరాల నుంచి కోయిల్‌సాగర్‌కు వచ్చే నీళ్లను కంపెనీకి ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. కంపెనీ యాజమాన్యం దౌర్జన్యాలను అడ్డుకున్న వారిపై వారు పెట్టిన కేసులు వెంటనే వాపస్ తీసుకోవాలని. లేనిచో నిజ నిర్ధారణ కమిటీ ద్వారా తెల్చుకుంటామన్నారు.

తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ



మరికల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో తపస్ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షులు సికిందర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంతో తపస్ ఎంతో ముందుందన్నారు. సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాలను కూడా తర్వలో చేయిస్తామన్నారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

మరికల్: స్థానిక ఉర్దూమీడియం పాఠశాల విద్యార్థులకు గురువారం ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ సంతోషిని పర్యవేక్షణలో ఒకటి నుంచి 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. వారి ఎత్తు, బరువు, ఏమైనా దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నాయో తెలుసుకున్నారు. అవసరమైన వారికి మందులు ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, మహ్మమ్మద్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.



గోవులను రక్షించాలని ధర్నా


వీరసావర్కర్ చౌరస్తాలో మృతి చెందిన గోవుతో ధర్నా చేపడుతున్న బజరంగ్ దళ్ నాయకులు

నారాయణపేట టౌన్ : గోవులను రక్షించాలని డిమాండ్ చేస్తూ బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో గురువారం వీరసావర్కర్ చౌరస్తాలో మృతి చెందిన గోవును ముందు ఉంచుకొని ధర్నా చేపట్టారు. జిల్లా కేంద్రంలో రోడ్లపై తిరుగుతున్న వాటిని రక్షించాలని ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఎలాంటి ఫలితం లేదని వాపోయారు. తాజాగా ఒక ఆవు దూడ రోడ్లపై తిరుగుతూ మృతి చెందంగా గమనించిన బజరంగ్‌దళ్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆవులు రోడ్లపై పారవేసిన చెత్తచెదారం, పాస్టిక్ కవర్లు కాగితాలు తింటూ ఆనారోగ్యానికి గురై మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు వచ్చే వరకు ధర్నా చేస్తామని పట్టుబట్టారు. కాగా పోలీస్‌లు ధర్నా స్థలానికి వెళ్లి తగిన చర్యలు తీసుకునేలా అధికారులకు వివరిస్తామని హామీ ఇవ్వడంతో విరమించారు. అనంతరం పట్టణ శివారులో గోవును ఖననం చేశారు. శ్రావణ్ కుమార్, రాఘవేంద్ర, నరేష్, భరత్, వినయ్, సందీప్, భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబా, జిల్లా కార్యదర్శి అనంతరెడ్డి కేంద్ర న్యాయ సలహాదారులు రఘవీర్‌యాదవ్, పాల్గొన్నారు.

అరుణోదయ సుబ్బారావుకు నివాళి

నారాయణపేట టౌన్ : అరుణోదయ రాష్ట్ర సహాయ కార్యదర్శి సుబ్బారావు సంతాపసభను జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో గురువారం నిర్వహించారు. అరుణోదయ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంజి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ, సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళ ప్రజల కోసం అంటూ 45 సంవత్సరాలుగా సమ సమాజ స్థాపనకై అసువులు బాసిన అమరవీరుల పైన ప్రజాసమస్యల పైన అనేక పాటలు రాసి, పాడిన కళాకారుడు సుబ్బారావు అన్నారు. ఆయన మరణం ప్రజలకు తీరని లోటు అని అన్నారు. ప్రజా సాంస్కృతికోద్యమంలో సాంస్కృతిక సైనికుడిగా పని చేశారని కొనియాడారు. ఏపీకెఎస్ జిల్లా కార్యదర్శి యాదగిరి, జిల్లాల ఉపాధ్యక్షుడు వెంకట్రాములు, జిల్లా సహా కార్యదర్శి ప్రశాంత్, కోశాధికారి నర్సిములు, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మండల కార్యదర్శి నర్సింహులు, నాయకులు సాయిలు, బాలకృష్ణ, హాజీమలంగ్, ఐఎఫ్‌టీయూ జిల్లా సహా కార్యదర్శి నరసింహా, పీవైఎల్ నాయకులు రాము, లాలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు


రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ధన్వాడ: ఖమ్మంలో జరిగే రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు కొండాపూర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రాజారాం తెలిపారు. ఈ నెల 6 నుంచి 8 వరకు ఖమ్మంలో జరిగే పురుషుల నెట్‌బాల్ పోటీలకు 17 మంది క్రీడాకారులు వెళ్లనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయిలో పోటీలలో ప్రతిభ చూపిన ఆ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సురేష్, నాగమణి, రామ్మోహన్‌గౌడ్, సుగుణాకర్ పాల్గొన్నారు.

భూ సమస్యను పరిష్కరించండి

మక్తల్: మండలంలోని పంచదేవ్‌పాడు గ్రామంలో తమ స్వంత భూమి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. ఈ మేరకు 141, 142, 143 తదితర సర్వేనంబర్లలో ఉన్న భూమి సమస్యను పరిష్కరించాలని దాదాపు 20 మంది రైతులు గురువారం మక్తల్ తహసీల్దార్ తిరుపతయ్యకు వినతిపత్రం అందజేశారు. పంచదేవ్‌పాడు గ్రామంలో ఓ రైతు తమను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఆంజనేయులు, అంజిలప్ప, వెంకటమ్మ, హరిజన్ ప్రకాష్, తాయప్ప, ఈదేప్ప, మణెమ్మలతో పాటు తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



ఊట్కూరు: గ్రామ శివారులో గురువారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ రాములు మాట్లాడుతూ తిప్రాస్‌పల్లి గ్రామానికి చెందిన గునుముక్కుల రాజు అనే డ్రైవర్ ఆగారం వాగు నుంచి నారాయణపేటకు ఇసుకను తరలిస్తుండగా త్రిలింగేశ్వర దేవాలయ సమీపంలో పోలీస్ సిబ్బంది మాతృనాయక్, మహమ్మద్ బషీర్‌లు పట్టుకున్నారని తెలిపారు. టాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు వివరించారు.

నేడు మున్సిపల్ కార్యాలయ ముట్టడి


విలేకర్లతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కోస్గి: కొత్తగా ఏర్పడిన మున్సిపల్ పరిధిలో పాత ఇళ్ల పేరు మార్పిడికి రాష్ట్ర అధికారుల ఆదేశాలు ఉన్నప్పటికి స్థానిక అధికారులు అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న మున్సిపల్ కార్యాలయ ముట్టడి, ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకులు సూచించారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గతంలో పంచాయతీగా ఉన్న సమయంలో తరాలుగా ఉంటున్న ఇళ్లకు ఎలాంటి రిజిస్ట్రేషన్లు లేకపోవడంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి పేరు మార్పిడి చేయాలని జిల్లా కలెక్టర్‌తోపాటు రాష్ట్ర మున్సిపల్ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారని, ఈ విషయంలో అందినంత దండుకొని అధికారులు పేరు మార్పిడి చేస్తున్నారన్నారు. ఎందరో పేదలు పేరు మార్పిడి చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కౌన్సిల్ తీర్మానం చేసినా అమలు చేయడం లేదన్నారు. ఈ విషయంలో సమగ్ర విచారణ జరపాలని పలుమార్లు కలెక్టర్‌కు పిర్యాధు చేశామన్నారు. బాధితులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ముట్టడిస్తామన్నారు. టీపీసీసీ మెంబర్ వార్ల విజయ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, కౌన్సిలర్లు గోవర్ధన్‌రెడ్డి, ఇద్రీస్, భాను నాయక్, యూత్ అధ్యక్షుడు టింట్ నర్సింహా, నాయకులు నాగులపల్లి నరేందర్, సలీం, దేవేందర్ తోపాటు పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా అడుగులు


మండల కేంద్రంలో ప్రభుత్వం కార్యాలయాల నిర్మాణానికి సర్వే చేసున్న రెవెన్యూ అధికారులు.

- కృష్ణా మండలంలో నూతన కార్యాలయాల ఏర్పాటుకు చర్యలు

కృష్ణా: నూతనంగా మాగనూర్ నుంచి వేరుపడి ఏర్పాటయిన కృష్ణా మండలంలో అభివృద్ధి పనుల కోసం వేగంగా చర్యలు తీసుకుంటున్నారు. వివిధ కార్యాలయ భవనాలు తదితరాల నిర్మాణం త్వరలోనే చేపట్టనున్నారు. అందుకోసం ఇప్పటికే అధికారులు సర్వే చేపట్టారు. 9 గ్రామ పంచాయతీలతో నూతన మండలంగా అవతరించిన కృష్ణాలో తరువాత మరో 4 గ్రామ పంచాయతీలు కొత్తగా ఏర్పడ్డాయి. మండలానికి చెందిన చాలామంది బాలికలు దూరాభారం వల్ల 10 తరగతి అనంతరం ఉన్నత విద్యకు దూరం అవుతుండడంతో కస్తూర్బా గాంధీ ఆశ్రమ పాఠశాలను 10 తరగతి నుంచి జూనియర్ కళాశాల వరకు పెంచారు. హిందుపూర్ గ్రామ శివారులో నూతన భవనం కూడా నిర్మించారు. అదేవిధంగా మండలంలో ప్రభుత్వ ఆస్పత్రితో పాటు వ్యవసాయ, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల నిర్మాణానికి ఇప్పటికే అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే, అధికారులు తెలిపారు. అదేవిధంగా ఈ మండలంలో విద్యుత్, తాగునీరు, అంతర్గత రహదారులు, సాగునీరు తదితర మౌలిక అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని వివరించారు. దీంతో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని తమ ప్రాంతం విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ చూపిస్తున్నారని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే చొరవతో పలుగ్రామాలకు రోడ్డు, విద్యుత్ తదితర కనీస సౌకర్యాలు కల్పించారని అంటున్నారు. అదేవిధంగా ఆస్పత్రి, ఇతర కార్యాలయాల ఏర్పాటు వేగంగా పూర్తిచేయాలని కోరుతున్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

కోయిల్‌కొండ: మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసేలా మండల అధికారులు చొరవ తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి మధుసూదన్‌గౌడ్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో జరుగుతున్న క్రీడా ప్రాంగణాలను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా హరితహారంలో భాగంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలలో మొక్కలను ఇచ్చిన గడువులోగా సిద్ధంగా ఉంచాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా పలుసూచనలు చేశారు. పనులపైన నిరంతర పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో పనుల పర్యవేక్షణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాములు, సూపరింటెండెంట్ హరిశ్చంద్రారెడ్డి, ఎంపీఓ శ్రీదేవి, ఏపీఓ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు


గుర్తించిన బాలకార్మికులతో స్మైల్ ఆపరేషన్ బృందం

మరికల్: మండల కేంద్రంలో చేపట్టిన ఆపరేషన్ స్మైల్ బృందం దాడులలో ఎనిమిది మంది బాలకార్మికులను పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. గురువారం మరికల్‌లోని మెకానిక్ షాప్‌ల్లో, మెడికల్, హోటళ్లు, కిరాణా దుకాణాల్లో, వెల్డింగ్‌షాపుల్లో వీరు పనిచేస్తున్నట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు. వారిని జిల్లా కేంద్రంలోని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరిచి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. బాలకార్మికులను పనిలో పెట్టుకున్న వారికి జరిమానా విధిస్తామని, కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ సత్యానారాయణ తెలిపారు.